ఎదురొడ్డి పోరాడి....

బాగేపల్లిలో సిపిఎంకు మూడవ స్థానం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం ఎదురొడ్డి పోరాడింది. నాలుగు స్థానాల్లో పోటీ చేసిన సిపిఎం అభ్యర్థులకు ఎన్నికల పక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ప్రత్యర్థి పార్టీలు అనేక ఆటంకాలు, అవరోధాలను సృష్టించినా తట్టుకుని నిలబడి పోరాడింది. బాగేపల్లిలో త్రిముఖపోరు నడిచింది. ఎన్నికల ముందు ఆయన పోటీ నుంచి తప్పుకున్నారంటూ బాగేపల్లి సిపిఎం అభ్యర్థి అనిల్ కుమార్‌పై ప్రత్యర్థులు విషప్రచారం చేసినప్పటికీ ఎన్నికల క్షేత్రంలో పోరాడి మూడవ స్థానంలో నిలిచారు. ఆయనకు 19621 ఓట్లు వచ్చాయి. ఇక్కడ కాంగ్రెసు అభ్యర్థి సుబ్బారెడ్డి గెలుపొందారు. కెజిఎఫ్ నియోజకవర్గంలో తంగరాజుకు 1008 ఓట్లు వచ్చాయి. కెఆర్‌పురా అభ్యర్థి ఎం.నంజేగౌడకు 1220, గుల్బర్గా రూరల్ అభ్యర్థిపాండురంగ మన్వీకర్‌కు 822 ఓట్లు వచ్చాయి. మొత్తంగా కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎంకు 0.06 శాతం ఓట్లు వచ్చాయి.

రెండోరోజూ అదే తీరు..

◆ కొనసాగుతున్న మంత్రి పెద్దిరెడ్డి సమీక్ష ◆ ఇన్‌ఛార్జి మంత్రికి ఫిర్యాదులు
◆ కళ్యాణదుర్గం అసమ్మతి నేతలు దూరం ◆ 'అనంత', గుంతకల్లుల్లోనూ అదే తీరు

అనంతపురం జిల్లాలోని వైసిపి నాయకుల్లో గ్రూపు తగదాలు అధిష్టానానికి తలనొప్పిగా మారాయి. జిల్లాలోని ఆపార్టీ నాయకుల్లో నెలకొన్న గ్రూపు తగాదాలను రూపుమాపడానికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జిల్లాలో రెండు రోజులుగా మాకాం వేశారు. అందులో భాగంగా రెండోరోజైన శనివారం నిర్వహించిన సమీక్షలో అసంతృప్తి నాయకులు తమ నియోజకవర్గ నాయకుడిపై జిల్లా మంత్రికి ఫిర్యాదులు చేశారు. రెండో రోజైన శనివారం జిల్లాలోని కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం నియోజకవర్గ నాయకులతో జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమీక్ష చేశారు. ఈసందర్భంగా అసంతృప్తివాదులు తమ సమస్యలను జిల్లా మంత్రికి వివరించారు.

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

వైసిపిలోని గ్రూపు తగాదాలను రూపు మాపి అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చే ఉద్ధేశ్యంతో వైసిపి అధిష్టానం చేపట్టిన దిద్దుబాటు కొనసాగుతోంది. జిల్లా ఇంఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెండు రోజులుగా ఇక్కడే మకాం వేసిన విషయం తెలిసిందే. రెండో రోజు కూడా జిల్లాలోని కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం నియోజకవర్గాల సమీక్ష చేపట్టారు. మొదటి రోజు తరహాలోనే రెండో రోజు సమీక్షలోనూ ఎమ్మెల్యేలపై ఆరోపణలను, అసంతృప్తులు కొనసాగినట్టు సమాచారం. శనివారం కళ్యాణదుర్గం నియోజకవర్గ సమీక్ష కొనసాగింది. ఈ సమీక్షలో మంత్రి ఉషచరణ్ శ్రీ పాల్గొన్నారు.అయితే ఈ సమీక్షకు ఆమెపై అసంతృప్తితోనున్న నేతలు ఎవరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగానూ మారింది. నియోజకవర్గ పరిశీలకులు ముందుగానే అసంతృప్తి నేతలకు సమాచారమిచ్చినా తాము రాబోమని ఫోనులోనే తేల్చిచెప్పినట్టు సమాచారం. బోయ తిప్పేస్వామి, ఎల్‌ఎం.మోహన్‌రెడ్డి, రఘునాథరెడ్డి, హనుమంతరాయుడు, కోనాపురం గంగాధర్ తదితర అసంతృప్తి నేతలెవరూ సమీక్షకు హాజరవలేదు. ఈ నేతలంతా ఇది వరకే అధిష్టానానికి మంత్రి వ్యవహార శైలిపై ఫిర్యాదు చేశారు. దీంతో అప్పట్లో రెండు,మూడు పర్యాయాలు అధిష్టానం ముఖ్య నేత వద్దనే పంచాయతీ జరిగినా తీరు మారకపోవడంతో సమీక్షకు దూరంగా నున్నట్టు అసంతృప్తి గ్రూపు నేతలు చెబుతున్నారు. వ్యతిరేక గ్రూపు పూర్తిగా దూరంగా ఉండటంతో మంత్రి మద్దతుదారులతోనే సమీక్ష పూర్తయింది. అనంతపురం నియోజకవర్గం సమీక్షలోనూ అసంతృప్తుల ఫిర్యాదులు అధికంగానే సాగినట్టు సమాచారం. ముందు నుంచి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి వ్యతిరేక గ్రూపు ఒకటి ఉంది. ఐదుగురు నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ వ్యతిరేక గ్రూపు మరోమారు మంత్రి ఎదుట కూడా తమ ఇబ్బందులను తెలియజేసినట్టు సమాచారం. పార్టీ కార్యక్రమాల్లోనూ, ప్రభుత్వ కార్యాక్రమాల్లోనూ అందరినీ సమన్వయం చేయడం లేదని చెప్పినట్టు తెలుస్తోంది. ఇక గుంతకల్లు నియోజకవర్గం వరకు చూసినప్పుడు ఇతర ప్రాంతాలతో పోలిస్తే తక్కువ సంఖ్యలోనే ఫిర్యాదులు, ఆరోపణలున్నట్టు సమాచారం. అసంతృప్తి నేతలు ఇక్కడ తక్కువగా ఉండటంతో నియోజకవర్గ సమీక్ష కొంత సాఫీగానే సాగినట్టు సమాచారం.

నేడు రెండు నియోజకవర్గాలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రెండు రోజులుగా చేపట్టిన సమీక్షలో ఆరు నియోజకవర్గాలు పూర్తయ్యాయి. ఇక మిగిలింది శింగనమల, రాప్తాడు ఈ రెండు నియోజకవర్గాల సమీక్ష కూడా ఆదివారం జరుపునున్నారు. దీంతో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సమీక్ష పూర్తవనుంది. ఇప్పటి వరకు జరిగిన ఆరు నియోజకవర్గాల్లో గుంతకల్లు ఒక్క నియోజకవర్గంలోనే అసంతృప్తులు తక్కువగా ఉన్నాయి. తక్కిన అన్ని చోట్ల పెద్దఎత్తునే ఎమ్మెల్యేలపై ద్వితీయ శ్రేణి నాయకులు, ముఖ్య నేతలందరూ అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. అయితే వీటిపై పార్టీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది కూడా వైసిపి నేతల్లో చర్చనీయాంశంగానూ మారింది. అన్నింటినీ విన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అసంతృప్తులను సంతృప్తి పరిచేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది కూడా పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. చర్యలేవీ లేకుండా కేవలం విని వెళ్లినంత మాత్రానా జరిగే ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలను సైతం వారు లేవనెత్తుతున్నారు.

రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లను జెసిబితో తొలగిస్తున్న దృశ్యం

అంధకారంలో గ్రామాలు

విద్యుత్, నీటి సరఫరా లేక ప్రజల ఇబ్బందులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండలంలోని పలు గ్రామాలు మూడు రోజులుగా విద్యుత్ సౌకర్యం అంధకారంలో మగ్గుతున్నాయి. మండల పరిధిలోని మార్లపల్లి, రాచువారి పల్లి ,బుగ్గపల్లి, కొట్లపల్లి ,నిడిమామిడి ,కొత్త నిడిమామిడి ,సురగానిపల్లి దండువారిపల్లి ,కత్తి వారి పల్లి, గాజులపల్లి ,గాజులపల్లి తాండ, బత్తలపల్లి, పైపల్లి గువ్వల గుట్టపల్లి, వెంకట గారి పల్లి ,కోనాపురం గ్రామాల్లో గత మూడు రోజుల నుండి విద్యుత్ సౌకర్యం లేక ప్రజలు విలవిలలాడిపోతున్నారు. గురువారం రాత్రి వీచిన గాలికి, కురిసిన వర్షానికి ఆయా గ్రామాల్లో దాదాపు 20 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి దాంతో విద్యుత్ లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే ఎండాకాలం ఉక్కపోత ఆపై విద్యుత్తు లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు, ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.మూడు రోజుల నుండి రాత్రి వేళలో నరకయాతన అనుభవిస్తున్నట్లు గ్రామస్తులు వాపోయారు. ఆరుబయట పడుకుందామంటే దోమల బెడద భరించలేకున్నామంటున్నారు. ఇంట్లో ఉక్క పోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. విద్యుత్ అధికారులు శుక్రవారం ఉదయం నుండి మరమ్మత్తులు పనులు చేపట్టారని అత్యధిక సంఖ్యలో విద్యుత్ స్తంభాలు, చెట్లు పడిపోవడంతో మరమ్మతు పనులు పనులు ఆలస్యం అవుతున్నాయని చెబుతున్నారు. ఆదివారం నాటికి పునరుద్ధరణ పనులు పూర్తి అవుతాయని ఆ శాఖ అధికారులు తెలిపారు. కానీ ఇప్పటికే గ్రామాల్లో తాగునీటి కొరతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు విద్యుత్ లేక బోర్లు పనిచేయకపోవడంతో తాగునీటి కోసం పట్టణాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వారు వాపోతున్నారు. అంతేకాక గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం లేక సెల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇంటర్నెట్లు, మూగబోయాయి. పలువురు సెల్ఫోన్ సంబంధాలు లేకపోవడంతో పక్కన ఉన్న పెడపల్లి ,గోరంట్ల, కొత్తచెరువు, పుట్టపర్తి, గ్రామాలకు వెళ్లి తమ సెల్‌ఫోన్లకు చార్జింగ్ పెట్టుకున్నారు. పై పల్లి, బత్తలపల్లి, వెంకటగారి పల్లి గ్రామాల వద్ద విద్యుత్ అధికారులు కొత్త స్తంభాలను నాటి విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించడానికి కృషి చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా బత్తలపల్లి వద్ద పడిన చెట్లను జెసిబిల సాయంతో తొలగిస్తున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఇపిసెట్ ఛైర్మన్ రంగజనార్ధన

ఈఏపీసెట్-23కు సర్వం సిద్ధం

15 నుంచి 19 వరకు ఇంజనీరింగ్, 22 నుండి 23 వరకు అగ్రికల్చర్ , ఫార్మసీ పరీక్షలు
ఈఏపీసెట్ ఛైర్మన్ ఆచార్య రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జేఎన్టీయూ, ఏపీ ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంజనీరింగ్, అగ్రికల్చం, ఫార్మాసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఈఏపీ సెట్ -23) ఈనెల 15 నుండి 19 వరకు, అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు 22 నుండి23 వరకు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అనంతపురం జేఎన్టీయూ ఉపకులపతి, ఈఏపీ సెట్ చెర్మన్ ఆచార్య రంగజనార్ధన పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానికి వర్శిటీ ఉపకులపతి కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం అందుకు సంబందించిన వివరాలను వెల్లడించారు. శనివారం వరకు ఈఏపీసెట్ పరీక్షలకు 3,37,733 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు, ఇందులో ఇంజనీరింగ్ కు 2,71,193 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశానికి 99,557 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. ఈ రెండింటికీ కలిపి 983 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ప్రవేశపరీక్షలకు గాను ఆంధ్ర,తెలంగాణ రాష్ట్రాలకు కలిపి 136 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థులు మొదటి ప్రాధాన్యత ఇచ్చిన పరీక్ష కేంద్రాలనే 97 శాతం కేటాయించామన్నారు. ఉదయం, సాయంత్రం జరిగే ఈ పరీక్షలకు ఒక్కో సెషన్ 27 మంది విద్యార్థులు పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్లోడ్ చేసుకుంటున్నారన్నారు. అందులో కేటగిరీలు, గ్రూపులు తదితర వాటిలో ఏమైనా తప్పులు ఉంటే ఈఏపీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు. ఇక పరీక్ష హాలుకు గంటన్నర ముందే చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్ష కేంద్రంలో ఇన్‌విజిలేటర్ చెప్పే సూచనలు తప్పక పాటించాలన్నారు. విద్యార్థులు పరీక్ష హాలు లోకి కేవలం హల్ టికెట్, బ్లూ,బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే తీసుకెళ్లాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వారి కేటగిరీలకు సంబంధించి గెజిటెడ్ అధికారితో ధ్రువీకరణ పత్రాలు తీసుకెళ్లి సమర్పించాల్సుంటుందన్నారు. అలా చేయని విద్యార్థులు ఫలితాలు హోల్డ్‌లో పెడతామని చెప్పారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరేందుకు బస్సులు నడపాలని రీజనల్ మేనేజర్లకు, కలెక్టర్లుకు సమాచారం ఇచ్చామన్నారు.ఈకార్యక్రమంలో ఈఏపీసెట్ కన్వీనర్ ఆచార్య శోభాబిందు, రిజిస్ట్రార్ శిశిధర్, భానుమూర్తి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో 104 సిబ్బంది నిరసన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు 104 సిబ్బంది చేపట్టిన సమ్మె, నిరసన దీక్షలు శనివారానికి ఏడో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా సిబ్బంది వినూత్నంగా తమ డిమాండ్లతో కూడిన ప్ల కార్డులను 104 వాహనాల ముందు ప్రదర్శించారు. 104ను ప్రయివేటీకరణ చేయకుండా ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని, బఫర్ ఉద్యోగులకు బకాయిలు, ట్రావెలింగ్ అలవెన్స్ చెల్లించాలని కోరారు. బదిలీ సౌకర్యం కల్పించాలని, 3 నెలలకు ఒకసారి యాజమాన్య ప్రతినిధులతో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పుట్టపర్తిలో నిర్వహించిన నిరసన దీక్షలో డ్రైవర్ మోహన్, లక్ష్మీపతి పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న 104 ఉద్యోగులు

సమావేశాలతోనే సరి...

◆ జిల్లా సమస్యలపై పట్టించుకోని ఎంపీ
◆ రాజధానికి ఒకటే రైలు.. ఒకటే కౌంటర్
◆ రైలు ఎక్కాలంటే పట్టాలు దాటాల్సిందే...

ఉన్న ఒకేఒక్క కౌంటర్ వద్ద టికెట్ల కోసం క్యూ కట్టిన ప్రయాణికులు

హిందూపురం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి నోచుకోవటం లేదు. ఈ సమస్యలు కేవలం సమావేశాల్లో ప్రస్తావించడానికే పరిమితమయ్యాయన్న విమర్శలు వినపడుతున్నాయి. హిందూపురం పార్లమెంట్‌నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచినప్పటినుంచి గోరంట్ల మాధవ్ అనంతపురం జిల్లా కేంద్రానికి లేదా...దేశ రాజధానికి పరిమితమవుతున్నారు. ఇక్కడి సమస్యలు ఆయనకు పట్టవు. సమస్యలపై పత్రికల్లో కథనాలు వస్తే...వాటిపై స్థానిక నాయకులు ఒత్తిడి తెస్తే....అలా సమావేశాలు నిర్వహించి....సమస్యలపై చర్చించి మమ అనిపిస్తారే తప్ప వాటి పరిష్కారానికి చొరవ చూపరన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు నిదర్శనం పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలే. ఇక్కడి రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై ఎంపీ మాధవ్ గత సంవత్సరం డిసెంబర్ 6 హిందూపురం రైల్వే స్టేషన్‌లో రైల్వే ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి బెంగళూరు డివిజన్ మేనేజర్ హాజరు కాలేదు. అతని ప్రతినిధిగా రైల్వే ఎడిఇఎన్ వంధేనాథ్ షేకావత్ హాజరయ్యారు. అన్ని సమస్యలపై చర్చించారు. సమస్యలను డిఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించే విధంగా చూస్తామని నాడు చెప్పారు. అయితే ఒక్క సమస్యకు పరిష్కారం లభించలేదు. ఇందులో ముఖ్యమైన సమస్యలను రైల్వే మంత్రితో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎంపీ అరోజు చెప్పారు. డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు శీతకాల సమావేశాలు, బడ్జెట్ సమావేశం రెండు పార్లమెంట్ సమావేశాలు జరిగాయి. బడ్జెట్ సమావేశంలో ప్రత్యేకించి రైల్వే బడ్జెట్‌పై సమావేశం జరిగింది. ఆ సమయంలో సైతం మన ఎంపీ నోరు విప్పలేదు. దీంతో హిందూపురం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి.

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో అనంతపురం తర్వాత అన్ని విధాలా అభివృద్ధి చెందిన పట్టణం హిందూపురం. ఇక్కడ రెండు లక్షలకు పైగా జనాభా ఉంది.హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజక వర్గాలకు కేంద్ర బిందువు హిందూపురం పట్టణం. దశబ్దాల క్రితమే నిర్మించిన ఇక్కడి రైల్వే స్టేషన్ రాక పోకలకు ముఖ్యమైన వనరు. ఇంతటి ప్రధానమైన రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయడంలో పాలకులు వెనుకబడ్డారు. ఎంతటి వెనుకబాటు తనమంటే ఇక్కడి నుంచి రాజదాని ప్రాంతమైన విజయవాడ, విశాఖపట్నానికి ఒకే రైలు నడుస్తోంది. అది కూడా బెంగళూరు నుంచి భువనేశ్వర్‌కు నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్. అనాదిగా ఈ రైలు నడుస్తోంది. నాటికి నేటికి ప్రయాణికులు 50శాతానికి పైగా పెరిగినప్పటికి ఒక్కటే రైలు నడుపుతున్నారు. ప్రయాణికుల రద్దీ పెరగడంతో విజయవాడ మీదుగా బెంగళూరు నుంచి మచలీపట్నం వరకు కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు వారంలో మంగళవారం, గురువారం, శనివారం మూడు రోజులు మాత్రమే నడుస్తోంది. దీనిని ప్రతి రోజు నడిచే విధంగా చర్యలు తీసుకుంటే కాస్తా రద్దీ తగ్గే అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికి దీని గురించి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న ఇద్దరు ఎంపీలు ఏ మాత్రం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. హిందూపురం పార్లమెంట్ నుంచి గెలుస్తున్న పార్లమెంట్ సభ్యులు కనీస సౌకర్యాలకు నోచుకుని హిందూపురం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై నోరు మెదపడం లేదు. సమస్యలను వివరించిన రైల్వే ఉన్నాతాధికారులతో చర్చిస్తే చిన్న చిన్న సమస్యలు పరిష్కారం అవుతాయి. అయినప్పటికి ఆ దిశగా పాలకులు ఆలోచించడం లేదు.

నిత్యం వేలాది మంది ప్రయాణం

విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం మహానగరాల్లో ఉన్న విద్యాసంస్థల్లో హిందూపురం, మడకశిర, పెనుకొండ ప్రాంతాల నుంచి దాదాపు 10 నుంచి 15వేల మంది విద్యార్థులు,ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 నుంచి 50వేల మంది వరకు ఉన్నత చదువుల కోసం వెళ్లారు. ఈ ప్రాంతం నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుంటారు. ఉన్న ఒక్క ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌తో పాటు వారంలో మూడు రోజుల పాటు నడిచే కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలును ప్రతి రోజు తిరిగే విధంగా చర్యలు తీసుకుని, దీంతో పాటు అదనంగా మరోక రైలు నడిచే విధంగా చర్యలు తీసుకున్నా రద్దీ తగ్గదు. దీంతో పాటు స్టేషన్‌లో సింగిల్ రిజర్వేషన్ కౌంటర్‌తో ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హిందూపురం వ్యాపార కేంద్రంతో పాటు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందింది. దీంతో పాటు ఈ ప్రాంత విద్యార్థులు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్నారు. దీంతో ప్రతి రోజు హిందూపురం రైల్వే స్టేషన్‌కు రూ.2 లక్షల నుంచి రూ. 2.50లక్షల వరకు ఆదాయం ఉంది. నెలకు సుమారు రూ.70లక్షల వరకు పురం రైల్వే స్టేషన్ నుంచి ప్రభుత్వానికి ఆదాయం లభిస్తోంది. అయితే అందుకు అనుగుణంగా రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన రైల్వే అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సింగల్ కౌంటర్ వల్ల ప్రయాణికులకు పూర్తి స్థాయిలో టికెట్లు అందక ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ, విశాఖపట్నానికి వెళ్లే ప్రశాంతి రైలుకు అయితే తత్కాల్ టికెట్లు మూడు నిమిషాల్లో పూర్తి అవుతున్నాయి. సిబ్బంది, కంప్యూటర్లు ఉన్నప్పటికి రెండవ కౌంటర్ అనుమతులు లేక పోవడంతో ప్రారంభించ లేదు.

అధికారుల నిర్లక్ష్యం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఏ రైల్వే స్టేషన్‌లో లేనివిధంగా హిందూపురం రైల్వే స్టేషన్‌లో వింత పరిస్థితి ఉంది. రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు ఎక్కడ చూసిన మొదటి ప్లాట్ ఫాంపై జరుగుతాయి. అయితే హిందూపురం రైల్వే స్టేషన్ లో మాత్రం 2వ, 3వ ఫ్లాట్ ఫాంలపై రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. దీనికి ప్రధాన కారణం రైల్వే ఇంజనీరింగ్ విభాగం అధికారుల నిర్లక్ష్యం నిలువెత్తున కనిపిస్తోంది. ప్రయాణికులు తమ ప్రయాణానికి సంబంధించి టికెట్ తీసుకొని రైలు ఎక్కడానికి వెళ్లాలంటే తప్పనిసరిగా ఓవర్ బ్రిడ్జ్ ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వృద్ధులు, అంగ వైకల్యం ఉన్నవారు అయితే వారి బాధలు వర్ణనాతీతం. వీరికి అవసరమైన లిఫ్ట్, ర్యాంప్ బ్రిడ్జి లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పాటు ప్రతి రైల్వే స్టేషన్‌లో కోచ్ ఇండికేషన్ బోర్డ్ ఏర్పాటు చేసి ఉంటారు. అయితే ఇక్కడ వాటిని కూడా ఏర్పాటు చేయలేదు. ఏ కోచ్ ఎక్కడ వస్తుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. మరి కొంతమంది బ్రిడ్జి ఎక్కి దిగడానికి ఆలస్యం అవుతుందని ప్లాట్ ఫామ్ దాటుకుని వస్తున్నారు. ఆ సమయంలో ఏ చిన్న పొరపాటు జరిగినా నిండు ప్రాణాలు గాలిలో కలిసే ప్రమాదం ఉంది.

సమావేశం నిర్వహించారు..చేతులు దులుపుకున్నారు

హిందూపురం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై ఎంపీ గోరంట్ల మాధవ్ రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆ సమయంలో అన్ని సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇక్కడ పరిష్కరం కాని సమస్యలను రైల్వే మంత్రి, ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారిస్తామని అన్నారు. ఇది జరిగి 6 నెలలు పూర్తి అయిన్పటికి కనీసం ఒక్క ఫోన్ కాల్‌తో ఏర్పాటు అయ్యే రెండవ టికెట్ కౌంటర్ సైతం ఏర్పాటు కాలేదు దీనిని బట్టి చూస్తే అభివృద్ధి, ప్రజాసేవపై స్థానిక ఎంపీకి ఎంత చిత్తశుద్ధి ఉందో ఇట్లే అర్థమవుతోంది.

రైల్వే అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎంపీ (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి
www.prajasakti.com

రైతుల శ్రేయస్సే సిఎం జగన్ ధ్యేయం

వ్యవసాయ పరికరాల పంపిణీలో ఎమ్మెల్యే కేతిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది, రైతుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అహర్నిశలు కషి చేస్తున్నాడని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నేలకోట, ఏలుకుంట్ల గ్రామాలకు చెందిన 279 మంది రైతులకు మైక్రో వాటర్ షెడ్ పథకం ద్వారా రూ.76.50 లక్షల విలువ చేసే 379 యూనిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు స్ప్రింక్లర్లు, ట్రాక్టర్ పనిముట్లు, స్ప్రేయర్లను పంపిణీ చేశామన్నారు. అవినీతికి తావులేకుండా అర్హత వున్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. టిడిపి హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు డబ్బులు ఇవ్వందే సంక్షేమ పథకాలు ఇచ్చే వారు కాదన్నారు. మరుగుదొడ్లకు దొంగ బిల్లులు చేసుకొన్నారని, నీరు-చెట్టు పథకం ద్వారా పాత గుంతలకే కొత్త బిల్లులు చేసుకొని కోట్లాది రూపాయలు స్వాహా చేశారన్నారు. కొండ ప్రాంతాల్లో ఉన్న ఏలుకుంట్ల, నేలకోట గ్రామాల్లో వాటర్ షెడ్ పథకం కింద చెక్ డ్యాంలు, ఫారంపాండ్ నిర్మాణాలను అధికంగా చేపట్టడం ద్వారా భూగర్భ జలం వద్ది చెందుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు, ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డ్వామా పిడి రామాంజనేయులు, ఎపిడి సుధాకర్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ రవీంద్రారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్, అశోక్‌కుమార్, ఆగ్రోస్ సంస్థ అధికారులు, వైసిపి నాయకులు నేలకోట ఓబిరెడ్డి, కేశవ, వెంకటేష్, నాయక్, సంజీవరెడ్డి, రవీంద్రారెడ్డి, బుడ్డారెడ్డిపల్లి నారాయణరెడ్డి, బాలప్ప, శంకర్‌రెడ్డి, రమేష్, బిల్వంపల్లి హరి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కరించినట్లు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.శివపార్వతి తెలిపారు. రాజీ మార్గం ద్వారా కక్షిదారులు రాజీ అయిన కేసులను పరిష్కరించారు. కొట్లాట కేసులు-76, అక్రమ ఇసుక రవాణా-6, చెక్ బౌన్స్ కేసులు-3, భూమి తగాదా కేసులు-5, ప్రాంసరీనోటు కేసులు-1, భార్య, భర్తల కేసు-1, బ్యాంకు రుణం కేసులు-16, గేమింగ్ కేసులు-211 పరిష్కారమయ్యాయి. బ్యాంకు రుణం కేసుల్లో రూ.7,69,500, గేమింగ్ కేసుల్లో రూ.1,21,487 వసూలు చేశారు.

లోక్ అదాలత్ నిర్వహిస్తున్న మెజిస్ట్రేట్ ఎం.శివపార్వతి

హిందూపురం: రాజీ మార్గాన్ని అనుసరించడం ద్వారా కేసులు సత్వరం పరిష్కరించుకోవచ్చని అదనపు జిల్లా జడ్జి శైలజ సూచించారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణంలో మెగా లోక్ అదాలత్ జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, న్యాయమూర్తులు ఆనంద తీర్థ, సుకుమార్ నేతృత్వంలో రెండు బెంచ్‌లను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో హాజరైన వారందరికీ ఏర్పాటు చేసిన భోజన సౌకర్యాన్ని న్యాయమూర్తులు ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి నాగరాజు, డీఎస్పీ కంజాక్షన్, ఏపీపీలు ఇందాద్, నగేష్, లోక్ అదాలత్ సభ్యులు నవేరా, పార్వతి, రత్నమ్మ, జ్ఞానేష్, శారద, హేమావతి పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.శంకర్రావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ముజీబ్ పసపల సయ్యద్, ఏజీపీ భాస్కర్ రెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.నాగరాజు, ఎస్‌బిఐ బ్రాంచ్ మేనేజర్లు పెనుకొండ, గోరంట్ల యూనియన్ బ్యాంక్ మేనేజర్, న్యాయవాదులు లోక్ అదాలత్ సభ్యులు అశ్వర్థనారాయణ, బి.మోహన్‌నాయక్, కే.అశ్వర్థ, డి.రాజేష్ నాయక్, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: పాతుకుపోయిన పెండింగ్ కేసులకు పరిష్కారం చూపినట్లు సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి తెలిపారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించినట్లు సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి తెలిపారు. ఒక బెంచి ఏర్పాటు చేయగా బెంచి మెంబర్లుగా లింగాల లోకేష్ రెడ్డి, కేవై సిరాజుద్దీన్ వ్యవహరించారు. మొత్తం 252 కేసులు పరిష్కరించారు. అందులో సివిల్, భరణం, చెక్ బౌన్స్, క్రిమినల్ కేసులను పరిష్కరించారు. సెకండ్ క్లాస్‌కు సంబంధించి 175 కేసులు అపరాధ రుసుముతో చెల్లించారు. సీనియర్ న్యాయవాదులు ప్రసాద్ రెడ్డి, సత్యనారాయణ గుప్తా, కే.నరసింహులు పోలీసు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-గోరంట్లరూరల్: టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ శనివారం మండల పరిధిలోని గుంతపల్లి, గడ్డంతండా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ముందుగా గాలివానకు పైకప్పు దెబ్బతిన్న గుంతపల్లి టిడిపి నేత జయశంకర్ రెడ్డి ఇంటిని పరిశీలించారు. అనంతరం గడ్డంతండా గ్రామ వెళ్లి ఇటీవల మృతి చెందిన టిడిపి కార్యకర్త రమేష్‌నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే రమేష్ భార్య రజిలీబాయికి రూ. 10 వేలు నగదు అందజేశారు. ఆమె వెంట మాజీ ఎంపిటిసి నరసింహయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు అంజనేయులు, బాలకృష్ణ చౌదరి, మండలాధ్యక్షుడు శంకర, లక్ష్మీనారాయణరెడ్డి, షణ్ముఖ నాయక్, వషభ దేవుడు, పరమేష్, బూచేపల్లి శివ, చంద్రాయప్ప, పాపన్న, నాగరాజు, రామకృష్ణప్ప, సింగిరెడ్డిపల్లి, సురేష్ శంకర్, కురుబ శంకరప్ప, నంజుండప్ప, విజ్జి, ఫణి, తదితరులు ఉన్నారు.

రమేష్‌నాయక్ భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న సవితమ్మ

మండలమీట్‌ని మమ అనిపించారు

చిలమత్తూరు: కోరం లేక వాయిదా పడిన సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎట్టకేలకు ఐదుగురు సభ్యులతో నడిపించి మమ అనిపించారు. కేవలం 30 నిమిషాల్లోనే నామమాత్రంగా సమావేశం ముగించారు. సమావేశానికి హాజరైన సభ్యులు ఏ అంశంపైనా పెదవి విప్పలేదు. హాజరైన వారిలో వీరాపురం సర్పంచ్ డ్రైనేజీ, పలగలపల్లి సర్పంచ్ విద్యుత్, సరఫరా సమస్యలను ప్రస్తావించారు. వ్యవసాయ, ఆరోగ్య శాఖ అధికారులు వారి శాఖలపై మాట్లాడగా మిగిలిన శాఖల అధికారులు మాట్లాడకుండానే సమావేశం ముగించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రూరల్ సిఐ, లేపాక్షి, చిలమత్తూరు ఎస్సైల తో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు ఎంపిడిఒ కార్యాలయం వద్ద మోహరించారు. అయితే ఎలాంటి గొడవలు జరగకనే సమావేశం ముగిసింది.

ఎంపిపి పదవికి రాజీనామా చేయాల్సిందే

చిలమత్తూరు: ఎంపిపి ఎన్నిక సమయంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ ఇక్బాల్ సమక్షంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఎంపిపిగా ఉన్న పురుషోత్తమరెడ్డి తన పదవికి రాజీనామా చేసి జగన్‌మోహన్‌కు అవకాశం ఇవ్వాలని కోరుతూ 10 మంది ఎంపిటిసిలు, ఇద్దరు వైస్ ఎంపిపిలు, వైసిపి మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఇందుకు నిరసనగానే తాము సర్వ సభ్య సమావేశానికి హాజరు కాలేదన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు ఐయ్యన్న, అంజలి, వైసిపి మండల కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి, ఎంపిటిసి జగన్ మోహన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, మంజునాథ్ రెడ్డి, ఆదినారాయణప్ప, సాని శిల్ప, సుధాకర్, ఇర్షాద్ బేగం, లక్ష్మీదేవి, నాగరాజు యాదవ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యపరీక్షలు

హిందూపురం: పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ కుమార్ రాజ్ ఆధ్వర్యంలో బెంగుళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో శనివారం 96వ ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 750 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 275 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అదే విధంగా గత నెల ఆపరేషన్లు చేసిన 275 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర కంటి ఆసుపత్రి బృంద సభ్యులు, డాక్టర్ స్వప్న, క్యాంపు ఇన్‌ఛార్జ్ శివప్రకాష్, ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కుమార్ రాజ్, సెక్రెటరీ కె. ఉషారాణి, జామియ మసీదు ముతవల్లి సూరావుల్లా, కమిటీ మెంబర్లు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కర్నాటకలో బిజెపికి గుణపాఠం : ఏపిసిసి సభ్యుడు కోట సత్యం

పుట్టపర్తి అర్బన్: కర్నాటక ఎన్నికల్లో ఓటర్లు బిజెపికి తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌ను ఆదరించారని ఏపిసిసి సభ్యుడు కోట సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ స్పష్టమైన మెజార్టీ సాధించిందన్నారు. దేశంలో 9 ఏళ్ల బిజెపి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలన్నీ పెరిగాయన్నారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడుతున్నారన్నారు. పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావులు, మతోన్మాదశక్తుల ఆగడాలు పెరిగిపోయాయన్నారు. దాంతో రైతులు, కార్మికులు, విద్యావంతులు, మేధావులు అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. వచ్చే లోకసభ ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ధర్మవరం టౌన్: కర్నాటకలో కాంగ్రెస్ విజయం సాధించడంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి రంగన అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు బాణాసంచా పేల్చి స్వీట్లు పంచారు. అనంతరం అశ్వర్థనారాయణ మాట్లాడుతూ రాహుల్ గాంధీ సునామిలో మోడీ మానియా కొట్టుకు పోయిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి అమీర్‌బాషా, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి మంజుల నరేంద్ర, ధర్మవరం పట్టణ అధ్యక్షుడు బైరవ నాయకులు సురేశ్, గణేశ్, గిరీష్, ఇంద్ర, నాగేంద్ర పాల్గొన్నారు.

ఎన్నికల ఫీవర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లా సరిహద్దున ఆనుకుని ఉన్న కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆ ప్రభావం జిల్లాలో కనిపిస్తోంది. గత వారంలో అక్కడ ఎన్నికల ఫలితాలు ఏ రకంగా ఉంటాయన్నది ఎక్కడ చూసినా జరిగిన చర్చ. జిల్లావాసులు అందరూ అక్కడి రాజకీయ పరిణామాలను ఆసక్తిగా గమనించడం గమనార్హం. 2018 ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో జెడిఎస్, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా తదుపరి ఏర్పాటు చేసుకున్న పరిణామాలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి బిజెపి అధికారాన్ని చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత అక్కడ మత ఘర్షణలు పెరగడం వంటివి జిల్లావాసులు గమనిస్తూ వచ్చారు. ఎందుకంటే జిల్లావాసులు అత్యధిక మంది కర్నాటకతో సత్సంబంధాలు, బంధుత్వాలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అక్కడి రాజకీయల పట్ల ఇక్కడి వారు అంతటి ఆసక్తి కనబరచడానికి కారణం. ఎన్నికల ఫలితాలు కూడా ఈ వారంతమైన శనివారం నాడే వచ్చేశాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అందరి అంచనాలకు మించి సీట్లను గెలుచుకుంది. అంతా 100 నుంచి 110 స్థానాల్లోపే గెలుస్తుందని అంచనా వేసినా ఆ తర్వాత బిజెపిని తట్టుకుని ఏ రకంగా అధికారాన్ని చేపడుతుందో చూడాలని భావిస్తూ వచ్చారు. అయితే అందరి అంచనాల కంటే అధికంగా 136 సీట్లలో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. పూర్తిస్థాయి మెజార్టీ రావడంతో ఇక్కడ రాజకీయ నాయకులు కూడా ఈ ఫలితాలను విశ్లేషించుకోవడం కనిపిస్తోంది. బిజెపికి వ్యతిరేకంగా ప్రజలున్నారన్నది స్పష్టమవుతోందన్న చర్చ సాగుతోంది. ఇక్కడ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎవరైనా జతకడితే ఏమవుతుందోనన్న చర్చ కూడా సాగుతోంది. ఇదే సమయంలో రాష్ట్రంలోనూ ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశాలున్నాయన్న ప్రచారం సాగుతోంది. అందుకు తగ్గట్టుగానే అధికార వైసిపి ఎన్నికల కసరత్తును ప్రారంభించినట్టు కనిపిస్తోంది. ఇకపోతే గడిచిన రెండు రోజులుగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇక్కడే మకాం వేసి నియోజకవర్గాల వారీగా సమీక్షలు చేపడుతున్నారు. నాయకుల్లో అసంతృప్తులను గుర్తించి సమన్వయ లోపాలను సరిదిద్దే పని చేపడుతున్నారు. ఇది చూసి అధికార వైసిపి ఎన్నికల కసరత్తుకు సిద్ధమవుతోందా అన్న చర్చ కూడా రాజకీయవర్గాల్లో నడుస్తోంది. ఇదిలాగుంటే ఈవారంలో వాతావరణంలోనూ మార్పులు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అంతక మునుపు వారం వరుసగా వర్షాలు పడ్డాయి. గత వారంలో చూస్తే వర్షాలు తగ్గి వడగాల్పులు వీయడంతో జనం ఉక్కపోతతో అల్లాడారు. వారంతంలో మరోమారు వాతావరణం చల్లబడటం, వర్షాలొచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. రాజకీయాల్లాగానే వాతావరణంలోనూ తరచూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వేసవిలో వస్తున్న మార్పులతో జనం అల్లాడిపోతున్నారు. ఒకవైపు వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వాతావరణం చల్లబడింది అని అనుకునేలోపే వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మొత్తంగా ఈ వారం అటు రాజకీయ పరిణామాలు, ఇటు వాతావరణ మార్పులు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. వర్షాలు రావడంతో ఖరీఫ్‌కు సన్నద్ధమయ్యే పనిలో రైతులు పడ్డారు. దుక్కులు దునుకునేందుకు సిద్ధమవుతున్నారు. విత్తన పంపిణీకి వ్యవసాయ శాఖ సన్నద్ధమవుతోంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించింది. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని తమ వాటా డబ్బులు కడితే విత్తన పంపిణీ చేపడతామని ప్రభుత్వం చెబుతోంది. రైతులు ఆ పనుల్లో ఉన్నారు.

నాడు నేడు పనులు వేగవంతం చేయాలి : డిఇఒ

ప్రజాశక్తి-హిందూపురం

పాఠశాలలు ప్రారంభానికి ముందే వివిధ పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద ప్రారంభించిన పనులను పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు ఇవ్వాల్సిన జెవికె మెటీరియల్‌ను పంపిణీ చేయాలని మండల విద్యాశాఖ అధికారులకు జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి ఆదేశించారు. శనివారం స్థానిక ఎంజిఎం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆమె పరిశీలించారు. అనంతరం ఎంజిఎం పాఠశాల ఆవరణంలో ఓ తరగతి గదలో భద్రపరచిన జెవికె మెటీరీయల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు జూన్ 12 నుంచి పాఠశాలలు పున: ప్రారంభం కానున్నాయని అప్పటి లోగా పాఠశాలల్లో నాడు-నేడు పథకం కింద చేపట్టిన అన్ని రకాల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అదే విధంగా జగనన్న విద్యా కానుక కింద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఏకరూప దుస్తులు ఇప్పటికే జిల్లాకు చేరాయన్నారు. పుస్తకాలు ఇప్పటి వరకు 40 శాతం వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు గంగప్ప, నాగరాజు, నాడు-నేడు నోడల్ అధికారి మూరార్జీ యాదవ్, ఎంజిఎం హెచ్ఎం సామ్రాజ్యం, ఉపాధ్యాయులు, సిఆర్‌పిలు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి: పాఠశాలలు పున:ప్రారంభమయ్యే సమయానికి మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో నాడు-నేడు పనులను పూర్తి చేయాలని శ్రీసత్యసాయి జిల్లా డీఈవో మీనాక్షి ఎంఈఓ లక్ష్మీదేవిని ఆదేశించారు. డీఈవో శనివారం మండల పరిధిలోని కొడిగినహళ్లి బిందునగర్ ప్రైమరీ పాఠశాలను సందర్శించి నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం పరిగి ఎమ్మార్సీకి వెళ్లి రికార్డులను, విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక కిట్లను పరిశీలించా రు. మరికొన్ని పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా వాటిని వీలైనంత త్వరగా ఎంఈఓ కార్యాలయానికి చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారిణి మీనాక్షి

లేపాక్షి: మండల పరిధిలోని చోళసముద్రం గ్రామంలోని పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను శనివారం డిఈఓ మీనాక్షి పరిశీలించి జూన్‌లో పాఠశాల పున:ప్రారంభించే నాటికి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలించారు. అనంతరం గొంగటిపల్లి పాఠశాల, ఒరింటల్ పాఠశాల, ఉర్దూ పాఠశాలను తనిఖీ చేశారు. ఆమె వెంట ఎంఈఓ నాగరాజు నాయక్, ఉపాధ్యాయులు మొరర్జీ యాదవ్, గిరిధర్, తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి సహకరించండి

హిందూపురం: హిందూపురం నియోజక వర్గంలో అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన శనివారం అనంతపురంలో మంత్రిని కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీతో పాటు పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నవీన్‌నిశ్చల్

పుట్టపర్తి రూరల్: శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డిని శనివారం ఏపీ ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిచ్చల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని పూలమాల, శాలువాతో సత్కరించారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇటీవల జరుగుతున్న రాజకీయ పరిస్థితులను నవీన్ నిశ్చల్ ఎస్పీ దష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట హిందూపురం వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు తాపాలి

ఓబులదేవరచెరువు: లేగ దూడలకు నట్టల నివారణ మందు తాపితే ఆరోగ్యంగా ఉంటాయని ఉపసంచాలకులు పశు వైద్యాధికారి టీవీ.సుధాకర్, పశువైద్యాధికారి సి.ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎం.కొత్తపల్లిలో శనివారం లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో మేలి జాతి దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. దూడల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటికి వచ్చే రోగాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే రైతులకు ఉచితంగా పశు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏహెచ్ఏ ప్రవీణ్ కుమార్ నాయక్, జిఎం నరసింహమూర్తి, హరిప్రసాద్, ఫకృద్దీన్, రైతులు పాల్గొన్నారు.

గంగాభవాని ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

గాడ్లపెంట: స్థానిక గంగాభవాని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా రావాలని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపిపి తాతం జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి భాస్కర్ రెడ్డి, జేఏసీ కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, బిసి మండల అధ్యక్షుడు జక్కల లక్ష్మీనరసింహగౌడ్ ఉన్నారు.

గుడికట్టు సంబరాలు విజయవంతం చేయండి

పుట్టపర్తి అర్బన్: గుడికట్టు సంబరాలను విజయవంతం చేయాలని కురుబ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సాయి ఆరామంలో శనివారం ఆ సంఘం నాయకులు గుడి కట్టు సంబరాలు గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూన్ మొదటి వారంలో ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో ఈ సంబరాలను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించామన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

'పది'లో ఎల్ఆర్‌జి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్నా సిబిఎస్ఈ బోర్డు వారు శుక్రవారం విడుదల చేసిన 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఎల్ ఆర్‌జి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపల్ భారతి తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు తమ పాఠశాలకు చెందిన కృష్ణ చైతన్య 93శాతం, షమి 21, అనుశ్రీ 89శాతం మార్కులు సాధించారన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్‌తో పాటు పాఠశాలల సెక్రటరీ బాలసుందరం, విద్యాలయ ప్రిన్సిపల్ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం

నల్లచెరువు: మండల పరిధిలోని పంతులుచెరువు గ్రామానికి చెందిన అంజనప్ప(37) ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అయితే అంజనప్ప ఇటీవల ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న స్నేహితులు (1999-2000లో పదో తరగతి చదివిన వారు) శనివారం రూ.31,500 అందజేశారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

లక్ష్మీవెంకటేశ్వరస్వామికి చక్రస్నానం

పెనుకొండ: పట్టణంలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు వెచ్చం అమర్నాథ్ కుటుంబ సభ్యులు సుమన్, డాక్టర్ రత్నాకర్, డాక్టర్ పవన్ కుమార్ పర్యవేక్షణలో భోగసముద్రం చెరువులో స్వామి వారికి చక్రస్నానం చేయించారు. అలాగే ఆలయం నుంచి భోగసముద్రం చెరువు వరకు స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి చక్రస్నానంతో పూజలు నిర్వహించి మళ్లీ స్వామి వారిని గుడికి చేర్చారు. కార్యక్రమంలో యాడికి నాగరాజు, సుధాకర్ గుప్తా, కన్నాస్వామి, ప్రగతి శ్రీనివాసులు, ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

విత్తనవేరుశనగ నాణ్యత పరిశీలన

మడకశిర రూరల్: మండల పరిధిలోని ఆర్.అనంతపురం గ్రామం రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం వీర నరేష్ సబ్సిడీ విత్తన వేరుశనగ కాయల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కే-6 రకం 3,500 కింటాళ్లు కేటాయించారని, సబ్సిడీ పోనూ రైతు ఒక బస్తాకు రూ.1,674 చెల్లించాలన్నారు. అనంతరం ఆర్‌బికెను సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శివలింగప్ప, నర్సేగౌడ్, ఆర్‌బికె ఇన్‌ఛార్జి, రైతులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా

పుట్టపర్తి రూరల్: ఇటీవల గాలివాన బీభత్సానికి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో మూడు రోజుల నుంచి తాగునీటి సమస్య ఎదుర్కొంటున్న జగరాజుపల్లి గ్రామానికి టిడిపి నేత సామకోటి ఆదినారాయణ శనివారం ట్యాంకర్లతో నీటిని అందజేశారు. జగరాజుపల్లి ఎస్సీ, బిసి, కాలనీవాసులు సమస్యను తన దష్టికి తేవడంతో నీటి ట్యాంకర్లను పంపుతున్నట్లు ఆయన తెలిపారు.

నేరాలు ఘోరాలు

భార్య పుట్టింటికెళ్లిందని భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

భార్య పుట్టింటికి వెళ్లిందని తీవ్ర మనస్థాపానికి గురైన భర్త బాబావలి(30) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం ధర్మవరం పట్టణంలో జరిగింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని మారుతి నగర్‌కు చెందిన బాబావలి బీరువాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారి మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ముస్కాన్ బేగం అలిగి పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన బాబావలి ఇంట్లో ఎవరూ లేని సమయంలో శుక్రవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. బాబావలి తల్లి గౌసియా హైదరాబాద్ నుంచి ధర్మవరం వచ్చింది. శనివారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తీయగా కుమారుడు ఉరికి వేలాడుతూ ఉండటం చూసి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి మతదేహాన్ని కిందకు దించి టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో జమేదార్ సూర్యనారాయణ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మతదేహాన్ని పోస్టుమార్టం కోసం ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. అతడికి భార్య, కుమారుడు ఉన్నాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

చిలమత్తూరు: కోడూరు తోపు వద్ద శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కనిశెట్టిపల్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. నరసింహారెడ్డి, తుమ్మలకుంటకు చెందిన రామాంజి ద్విచక్రవాహనంపై జాతీయ రహదారిపై వెళ్తుండగా వెనుక వైపు నుంచి అతివేగంగా వచ్చిన ఈచర్ వాహనం ఢీకొంది. ఈ ఘటనలో నరసింహారెడ్డి అక్కడికక్కడే మతి చెందగా రామాంజి తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అలాగే కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

మట్కాబీటర్ల అరెస్ట్

గుడిబండ: ఐదుగురు మట్కా బీటర్లను అరెస్టు చేసి, వారి నుంచి రూ. 2,61,100 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సురేష్ బాబు తెలిపారు. మడకశిర పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో సిఐ మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు గుడిబండ ఎస్ఐ ప్రతాప్‌తో కలిసి వెళ్లి కేఎన్ పల్లి గ్రామంలోని ఎంపీపీ స్కూల్ పక్కన ఎస్సీ కాలనీకి పోయే దారిలో మట్కా కార్యకలాపాలు సాగిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే వారి నుంచి రూ. 2,61,100, మట్కా పట్టీలు, 5 మొబైల్ ఫోన్లు, 5 పెన్నులను సీజ్ చేశామన్నారు.

ఆటో దొంగ అరెస్ట్

లేపాక్షి: కేసు నమోదు చేసిన 24 గంటల్లోపే చోరీకి గురైన ఆటోను, నిందితుడు ప్రసాదను అరెస్టు చేసినట్లు హిందూపూర్ రూరల్ సీఐ వేణుగోపాల్, లేపాక్షి ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. డ్రైవర్ కళ్లలో కారం కొట్టి కొడవలితో బెదిరించి ఆటో దొంగలించిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం లేపాక్షిలో చోటుచేసుకుంది. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు లేపాక్షి మండలంలోని మనెంపల్లి గ్రామానికి చెందిన రాజుబాబు కొడుకు ప్రసాద్ చెడు వ్యసనాలకు బానిసై ఆటోను దొంగలించినట్లు తెలిపారు. శనివారం ఉదయం నిందితుడిని అరెస్ట్ చేసి, అతడి నుంచి ఆటోను, కొడవలి, కారం పొడి ప్యాకెట్ స్వాధీనం చేసుకొని కోర్టులో అప్పగించినట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసిన వారిలో పోలీసు సిబ్బంది లక్ష్మీపతి, చంద్ర, రమణ, తదితరులు పాల్గొన్నారు

గృహ లబ్ధిదారులతో ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి

జగనన్న గృహ నిర్మాణాలకు భూమిపూజ

గాండ్లపెంట: మండల కేంద్రానికి సమీపంలోని చిన్నమిట్ట వద్ద చేపట్టనున్న జగనన్న లే అవుట్‌లో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి గృహ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 134 ఇళ్లు మంజూరయ్యా యని, వాటిని వెంటనే పూర్తి చేయా లన్నారు. జగనన్న కాలనీలో నూతనంగా బోరు వేసి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని ఎంపిడిఒ డి.అంజనప్పను ఆదేశించారు. జగన్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జయచంద్రరెడ్డి, సీనియర్ సహాయకుడు ఎన్.అమీర్‌బాషా, ఎంపిపి తాతం జగన్మోహన్, వైసిపి మండల్ కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి భాస్కర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎస్పీ హైదర్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్ అలీ, సర్పంచిలు సుధాకర్, రవీంద్రనాయక్, ఉత్తన్న, లబ్ధిదారులు పాల్గొన్నారు.

15న సంఘీభావ పాదయాత్ర : పరిటాల సునీత

రామగిరి: నారా లోకేష్ యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయతీలోని సజ్జలకాలవ మెయిన్ రోడ్డుపై ఉన్న ఆంజనేయస్వామి గుడి నుంచి ఉదయం 8 గంటలకు సంఘీభావ పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు పరిటాల సునీత తెలిపారు. మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాదయాత్ర కురుగుంట, అక్కంపల్లి, ఎన్ఆర్ కాలనీ, కక్కలపల్లి కాలనీ పాపంపేటలోని జియో ఎదురుగా ఉన్న రామాలయం గుడి వరకు సాగుతుందన్నారు. కావున రామగిరి మండల టిడిపి నాయకులు కార్యకర్తలు, మండల, గ్రామ, మహిళా కమిటీల సభ్యులు, క్లస్టర్ ఇన్‌ఛార్జీ లు, తెలుగు యువత, పరిటాల అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

22న కలెక్టరేట్ వద్ద 'ఉపాధి' కూలీల ధర్నా

సోమందేపల్లి: మండల పరిధిలోని పెద్దకొండ సమీపంలో ఉపాధి హామీ కూలీలు పని చేస్తున్న ప్రదేశా నికి శనివారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు బాలస్వామి ఆధ్వర్యంలో వెళ్లి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ పేదల పొట్ట కొడుతున్నారని వాపోయారు. ఈ నెల 22న ఉపాధి హామీ సంరక్షణకై జిల్లా కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాకు ఉపాధి కూలీలు పెద్దఎత్తున హాజరై విజయం విజయవంతం చేయాలని కోరారు.

'పది' విద్యార్థుల ఉచిత శిక్షణకు విశేష స్పందన

రొద్దం: పదో తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థులకు ఆర్.మరువపల్లి స్కూల్‌లో ధనుంజయ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఏర్పాటు చేయగా విశేష స్పందన లభిస్తోంది. ఉచిత శిక్షణ, ఉచిత వసతి ఏర్పాటు చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

17న ఎన్టీఆర్ శత జయంతి

మడకశిర రూరల్: మడకశిర పట్టణంలో ఈ నెల 17వ తేదీ ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు నిర్వహిస్తున్నా రు. ఈ నేపథ్యంలో స్థానిక యాదవ కల్యాణ మండపం వద్ద జరుగుతున్న సభ ఏర్పాట్లను శనివారం రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పరిశీలించారు. ఆయన వెంట గుండుమల మాజీ సర్పంచి చంద్రప్ప, నాయకులు ఉన్నారు. అలాగే గుడిబండ మండల పరిధిలోని కుంకుల్ గ్రామంలో టిడిపి సీనియర్ నేత, డాక్టర్ సెల్ మండల అధ్యక్షుడు కొంకల కష్ణమూర్తి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కష్ణమూర్తి మాట్లాడుతూ ఎన్టీఆర్ శత జయంతి వేడుకలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

జిఒ-1 రద్దును స్వాగతిస్తున్నాం

మడకశిర రూరల్: ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల గొంతును నొక్కాలనే దురుద్దేశంతో వైసిపి ప్రభుత్వం తెచ్చిన జిఒ-1ని హైకోర్టు కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నామని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పిఆర్ మురళి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో అంతిమంగా గెలిచేది, నిలిచేది అంబేడ్కర్ రాసిన రాజ్యాంగమే అన్నారు. జగన్ లాంటి నాయకులు వస్తారని నాడే ఊహించి అంబేడ్కర్ భారత రాజ్యాంగంలో పౌరులు, వారి ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించారన్నారు.